గిరిజన గురుకుల కళాశాలలో ప్రవేశాలు

కొడంగల్, జూన్ 6 : రంగారెడ్డి – హైదరాబాద్ రీజియన్ గిరిజన గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నామని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ జిల్లాలో 2025–26 విద్యా సంవత్సరానికి కొడంగల్‌లోని గిరిజన కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బీపీసీ గ్రూపుల్లో ప్రవేశాలకు అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన గిరిజన బాలురు ఈ నెల 10న ఉదయం 11 గంటలకు టీజీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ పాత కొడంగల్ చెరువు సమీపంలో ఉన్న కళాశాలలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. ఈ కౌన్సెలింగ్‌కు విద్యార్థులు టీసీ, మెమో, స్టడీ, కండక్ట్ సర్టిఫికెట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకు రావాలని తెలిపారు. గ్రామీణ విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం రూ.లక్షా 50 వేలు మించరాదన్నారు. పట్టణ ప్రాంతానికి చెందిన వారికి రూ.రెండు లక్షలకు మించరాదని తెలిపారు. అలాగే ఆధార్ జిరాక్స్, స్పోర్ట్స్, అర్ఫాన్, పీహెచ్‌సీ ధ్రువీకరణ పత్రాలు, కలర్ ఫొటోలు, రెండు జతల జిరాక్స్ కాపీలతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మిగతా వివరాలకు సెల్: 8333925370 నంబర్‌లో సంప్రదించాలని వివరించారు.

9 నుంచి డీఈఈ అభ్యర్థులకు కౌన్సెలింగ్

వికారాబాద్, జూన్ 6 : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన డీఈఈ సెట్–2025లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 9 నుంచి 13 వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని వికారాబాద్ ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామాచారి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరంలో తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ మీడియంలో అడ్మిషన్‌ల కోసం ఒరిజినల్ ధ్రువపత్రాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, పది, ఇంటర్ మెమోలు, 4 నుంచి 12వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఆదాయ, కుల తదితర ఒరిజినల్ ధ్రువపత్రాలతో వికారాబాద్ డైట్ కళాశాలలో హాజరు కావాలని తెలిపారు.

నిర్మాణ పనులు నాణ్యతగా ఉండాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- బొంరాస్‌పేట, దుద్యాల కొడంగల్ మండలాల పరిధిలో రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనుల పరిశీలన

బొంరాస్‌పేట : అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

బొంరాస్‌పేట, జూన్ 6 : మండల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి నిర్మాణ పనులు నాణ్యతగా ఉండాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. మండలంలో నూతనంగా చేపట్టిన రోడ్డు, పలు అభివృద్ధి పనులను శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుర్రితండా నుంచి బొంరాస్‌పేట వరకు మెట్ల కుంట మీదుగా నిర్మిస్తున్న రోడ్డు పనులు, టేకులగడ్డ తండా నుంచి ధారూరు మండలంలోని గురుకొట్ల రోడ్డు, సలిందాపూర్ నుంచి మాలకుంట మీదుగా ముద్దాయిపేట వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. అలాగే జాతీయ రహదారి నుంచి చౌదర్ పల్లి రోడ్డు, కొత్తూరు నుంచి దేవనూర్ వరకు, బొంరాస్ పేట మండల కేంద్రానికి రోడ్డు మధ్యలో నిర్మిస్తున్న కల్వర్టు పనులను తనిఖీ చేశారు. బురాన్‌పూర్‌లో నిర్మించే ఇంటిగ్రేటెడ్ పాఠశాల, ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. మండల పరిధిలో చేపడుతున్న పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అలాగే బురాన్‌పూర్, బొంరాస్‌పేట పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. బురాన్‌పూర్ బడిబాటలో భాగంగా ఉపాధ్యాయులతో కలెక్టర్ మాట్లాడారు. బడీడు పిల్లలు ప్రతి ఒక్కరూ పాఠశాలలో చేర్చే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి, కడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ సత్యనారాయణ రెడి, డీఈ సుదర్శన్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హకీంపేటలో..

దుద్యాల మండల పరిధిలో ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల్లో భాగంగా చేపడుతున్న నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం దుద్యాల మండల పరిధిలోని హకీంపేటలో చేపడుతున్న జిల్లా పరిషత్ భవన నిర్మాణ, పీసీ తండా రోడ్డు, గౌరారం నుంచి లగచర్ల రోడ్డు పనులను కలెక్టర్ పరిశీలించారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

వేగవంతంగా పూర్తిచేయాలి

కొడంగల్, జూన్ 6 : రోడ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా ఇండ్లను కోల్పోతున్న కుటుంబాలకు స్థలాలను కేటాయించేందుకు చదును చేస్తున్న భూమి, రోడ్ల పనులను కలెక్టర్ పరిశీలించారు. అలాగే బుల్కాపూర్ బీటీ రోడ్డు, చిట్లపల్లి తండా వరకు చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. రోడ్ల నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

- రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి
- మల్లాపూర్‌లో ఫిర్యాదుల స్వీకరణ

రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

కొత్తూరు, జూన్ 6 : రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. కొత్తూరు మండల పరిధిలోని మల్లాపూర్‌లో జరిగిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొని రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఇబ్బంది పడకుండా భూ సమస్యలు పరిష్కరించేందుకు వీలుగా ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి వారి నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నామని చెప్పారు. రైతులు ఈ సదస్సులను ఉపయోగించుకొని తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. చాలా గ్రామాల్లో అప్పటికప్పుడే చాలా సమస్యలను రెవెన్యూ సిబ్బంది పరిష్కరిస్తున్నారని చెప్పారు. అలాగే ఎంత వ్యవధిలో సమస్యను పరిష్కరిస్తారో రైతులకు తెలియజేస్తున్నారని వివరించారు. ఇన్ముల్‌నర్వలో జరిగిన రెవెన్యూ సదుస్సులో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. అయితే మల్లాపూర్‌లో 34, ఇన్ముల్‌నర్వలో 23 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. మొత్తం 57 దరఖాస్తులో 28 దరఖాస్తులు పరిష్కారానికి అమోదం పొందాయని వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో సరిత, డిప్యూటీ తహసీల్దార్ జంగయ్య, ఆర్ఐ రాంబాబు, నాయకులు చిర్ర మధుసూదన్‌రావు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

సమావేశంలో మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మహేశ్వర్

పరిగి, జూన్ 6 : మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మహేశ్వర్ పేర్కొన్నారు. రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎమ్ఏఈ పెర్ఫార్మెన్స్ ర్యాంప్ అనేది ప్రపంచబ్యాంకు నిధులతో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను పరిపుష్టం చేయనున్న పథకం అన్నారు. శుక్రవారం పరిగిలో ఏఎల్ఈఏపీ ఆధ్వర్యంలో ఆర్ఏఎంపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మహేశ్వర్ మాట్లాడుతూ.. ర్యాంప్ పథకంలో భాగంగా భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక మంత్రిత్వ శాఖ, తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమల శాఖ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), అలీప్ (అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా (ఏఎస్ఈఏపీ), సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్స్ డెవలప్‌మెంట్ సంయుక్తంగా తెలంగాణలో మహిళల స్వావలంబన కోసం ప్రయత్నం చేస్తున్నాయని చెప్పారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి 15 రోజులు పరిశ్రమ నిర్వహణ, వ్యాపార ఉత్పత్తుల మార్కెటింగ్ మెళకువలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని తెలంగాణ వ్యాప్తంగా ఎస్‌హెచ్‌జీ మహిళల కోసం, అంకుర సంస్థల కోసం ఉచితంగా నిర్వహిస్తున్నదన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు అవసరమైన పద్ధతులు, ఉపకరణాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాల తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఏఎల్ఈఏసీ ఎంసీ సభ్యురాలు కవితారాజేశ్, సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ నోడల్ అధికారి ప్రియాంక, ఏపీఎం శ్రీనివాస్ రెడ్డి, సీసీలు, కులకచర్ల, పూడూరు మండలాల ఎస్‌హెచ్‌జీ సభ్యురాళ్లు పాల్గొన్నారు.

బడీడు పిల్లలు పాఠశాలలో ఉండాలి

కొడంగల్, జూన్ 6 : బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని డీఈవో రేణుకాదేవి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులకు సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాటలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బడిబాటలో భాగంగా మూడు రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు డిజిటలైజేషన్ తరగతులు నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఏఐ విధానాన్ని ప్రవేశపెట్టి వినూత్న బోధనకు శ్రీకారం చుడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు పెంచడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వర్క్ బుక్స్, నోట్ బుక్స్, స్కూల్ యూనిఫామ్‌తో పాటు మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తలిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉషశ్రీ, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, ఎంఈవో రాందెడ్డి, సెక్టోరియల్ అధికారి రజినీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఈవో రేణుకాదేవి

క్షయ వ్యాధి నిర్మూలనకు సహకరించాలి

చిన్న నందిగామ పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కొడంగల్, జూన్ 6 : క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఉపవైద్యాధికారి, టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవీందర్ యాదవ్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని చిన్న నందిగామలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయవ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 105 మందికి టీబీ ఉన్నట్లు గుర్తించి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు ఉండడంతో పాటు బరువు తగ్గడం, ఆకలి మందగించడం తదితర సూచనలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కొడంగల్ ప్రభుత్వ దవాఖానలో ఈ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షలో క్షయవ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు ఉచితంగా మందులు అందించడంతో పాటు పౌష్టికాహారం కోసం రూ.1000 వారి ఖాతాలో జమ చేస్తామన్నారు. వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో అంగడి రైచూర్ వైద్యాధికారిణి డాక్టర్ బుష్రా, వైద్యులు డా.లక్ష్మి డా.మహేందర్ డాక్టర్ నిఖిత, సూపర్‌వైజర్ రహత్ అలీ, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పబ్లిక్ పాఠశాల అభివృద్ధికి కృషి

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

మంచాల, జూన్ 6 : మంచాల ప్రభుత్వ పాఠశాలను తెలంంగాణ పబ్లిక్ పాఠశాలగా అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులను కేటాయించనున్నట్లు రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ అన్నారు. శుక్రవారం మంచాల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, యువజన సంఘాల సభ్యులు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాఠశాల అభివృద్ధి కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలి తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మంచాల పబ్లిక్ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక నిధులను కేటాయిస్తున్నామని, అందుకు అవసరమైన పనులను వెంటనే చేపట్టాలని కోరారు. కార్పొరేట్ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేకపోయినా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.లక్షల ఫీజులు తీసుకుంటున్నారని తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలను తెలంగాణ పబ్లిక్ పాఠశాలల పేరుతో కోట్లాది రూపాయలు కేటాయించి విద్యార్థులకు విశాలమైన గదులు, క్రీడాస్థలాలు, లైబ్రరీలతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరూ తమ పిల్లలను తెలంగాణ పబ్లిక్ పాఠశాలలో చేర్పిస్తే రాబోయే రోజుల్లో ప్రైవేటు పాఠశాలలు కనుమరుగయ్యే పరిస్థితిలో ఉంటాయని చెప్పారు. అనంతరం పాఠశాల అభివృద్ధి కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు, రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు జ్యోష్న, పద్మజ, జిల్లా డిప్యూటీ నోడల్ అధికారి రామారావు, మంచాల ఎంఈవో రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

రూ.50వేలను కాజేసిన మహిళలు

వికారాబాద్, జూన్ 6 : ఓ వృద్ధుడి వద్ద రూ.50వేల నగదును గుర్తు తెలియని మహిళలు కాజేసిన ఘటన శుక్రవారం వికారాబాద్ పట్టణంలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు.. ధారూరు మండల పరిధిలోని కెరెల్లి గ్రామానికి చెందిన అనంతయ్య (70) శుక్రవారం ఉదయం వికారాబాద్ పట్టణంలోని ఎస్‌బీఐకి వచ్చారు. వ్యవసాయ ఖర్చుల కోసం రూ.50వేల నగదును తీసుకున్నాడు. ఈ నగదును తీసుకుంటుండగా ముగ్గురు మహిళలు గమనించారు. ఎలాగైనా ఆ నగదును కాజేయాలని పన్నాగం పన్నారు. ఆ వృద్ధుడు మెడికల్ షాపులో మందులు తీసుకోవాలని తెలిసిన వారితో మాట్లాడుకోవడం ఆ మహిళలు విన్నారు. వృద్ధుడి కంటే ముందుగా వారు ఆ షాపునకు వెళ్లారు. వృద్ధుడు బీజేఆర్ చౌరస్తాలో ఉన్న పవన్‌కుమార్ మెడికల్ షాపులో మందులు తీసుకుంటుండగా రూ.50వేల నగదును కాజేశారు. మందులు తీసుకున్న తర్వాత వృద్ధుడు చూసుకునే సరికి నగదు కనిపించలేదు. తెలిసిన వారి సాయంతో సీసీ కెమెరాలను పరిశీలించగా ముగ్గురు మహిళలు డబ్బులు కాజేసినట్లు గుర్తించారు. వెంటనే వికారాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనుమానాస్పదంగా ముగ్గురు మహిళల కదలికలు సీసీటీవీలో కనిపించాయి.

కేశంపేట పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

కేశంపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి

కేశంపేట, జూన్ 6 : కేశంపేట పోలీస్ స్టేషన్‌ను సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి శుక్రవారం సాయంత్రం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి పలు సూచనలు, సలహాలను అందజేశారు. నేరాలకు సంబంధించిన ఫైల్స్‌ను పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో పెట్టుకో వద్దని, సంబంధిత అంశాలపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు చేరవేసి కోర్టుకు అందజేయాలన్నారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీకి తావులేకుండా కృషి చేయాలని, మండలంలో ఎలాంటి ఘటనలు జరిగినా వెంటనే స్పందించి బాధితులకు అండగా నిలవాలన్నారు. అంతకుముందు సీపీ తోపాటు ఉన్నతాధికారులకు ఎస్సై రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో శంషాబాద్ డీసీపీ రాజేశ్, అడిషనల్ డీసీపీ పూర్ణచందర్, షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ, ఎస్సై రాజ్‌కుమార్, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

వాస్కోడిగామ రైల్లో ఆబ్కారీ దాడులు

సిటీబ్యూరో, జూన్ 6(నమస్తే తెలంగాణ): గోవా నుంచి సికింద్రాబాద్ వస్తున్న వాస్కోడీగామ రైలులో ఆబ్కారీ ఎస్‌టీఎఫ్ అధికారులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో 1.5లక్షల విలువజేసే 48నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే... గోవా నుంచి పెద్దఎత్తున నగరానికి నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సరఫరా జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్, డీటీఎఫ్ బృందాలు శుక్రవారం గోవా నుంచి సికింద్రాబాద్ వస్తున్న వాస్కోడీగామ రైలును షాద్‌నగర్ నుంచి కాచిగూడ వరకు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో రూ.1.5లక్షల విలువజేసే 48 మద్యం బాటిళ్లు లభించినట్లు అధికారులు వెల్లడించారు. ఆబ్కారీ ఈడీ షానవాజ్ ఖాసీం ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ దాడుల్లో ఎస్‌టీఎఫ్ సీఐలు భిక్షా రెడ్డి, వెంకటేశ్వర్లు, నాగరాజులతోపాటు సికింద్రాబాద్ డీటీఎఫ్ సీఐతోపాటు మొత్తం 35 మంది సిబ్బంది పాల్గొన్నారు.

పీజీడీసీఏ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీజీడీసీఏ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీడీసీఏ (సీబీసీఎస్) మొదటి, రెండో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్ష ఫలితాలను విడుదల చేశామన్నారు.

డిగ్రీ కోర్సుల ఇన్‌స్టంట్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల చివరి సెమిస్టర్ ఇన్‌స్టంట్, మేకప్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ అన్ని కోర్సుల ఆరో సెమిస్టర్ ఇన్‌స్టంట్ పరీక్ష ఫీజును వచ్చే నెల 1వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 4వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

బీఈడీ ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని, ఫలితాలను తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మార్కు మెమోలను సంబంధిత కళాశాల నుంచి మూడు వారాల తర్వాత పొందవచ్చని పేర్కొన్నారు. ఈ ఫలితాల రీవాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి ఈ నెల 17వ తేదీలోగా, రూ.200 అపరాధ రుసుముతో 20వ తేదీ వరకు టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 5వ తేదీ వరకు తమ కార్యాలయంలో చెల్లించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

నకిలీ పత్రాల తయారీ కేసులో 16మంది అరెస్టు

పరారీలో మరో ఇద్దరు

సిటీబ్యూరో, జూన్ 6(నమస్తే తెలంగాణ): నకిలీ డాక్యుమెంట్లను తయారు చేస్తున్న ముఠాలో ఇప్పటి వరకు 16మందిని అరెస్ట్ చేయగా, మరో ఇద్దరు మున్సిపల్ ఉద్యోగులు పరారీలో ఉన్నారు. గత నెల 15వ తేదీన ఎల్బీనగర్ ఎస్‌ఓటీ, సరూర్‌నగర్ పోలీసులు సంయుక్తంగా ఈ నకిలీ సర్టిఫికెట్ల తయారీ ముఠాను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో 280 నకిలీ సేల్ డీడ్స్‌ను తయారు చేయడం సంచలనం రేకెత్తించింది. ఈ కేసులో మొదట ఆరుగురు ప్రధాన సూత్రధారులను అరెస్ట్ చేసిన పోలీసులు, తరువాత దఫ దఫాలుగా నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసులో మొత్తం 18 మంది నిందితులు ఉండగా.. ఇప్పటి వరకు 16మందిని అరెస్ట్ చేయగా ఇద్దరు మున్సిపల్ సిబ్బంది పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పాత తేదీలతో ఉన్న డాక్యుమెంట్లు ఉపయోగించి నకిలీ సేల్‌డీడ్స్, ఇతరత్రా డాక్యుమెంట్లతో పాటు నకిలీ బర్త్ సర్టిఫికెట్లు కూడా ఈ ముఠా తయారు చేసింది. 570 నకిలీ డాక్యుమెంట్లను పోలీసులు గుర్తించగా.. అందులో 280 నకిలీ సేల్‌డీడ్స్ ఉన్నట్లు గుర్తించారు. అయితే ఈ నకిలీ సేల్‌డీడ్స్ ఎక్కడ ఉపయోగించారనే విషయంపై ఆరా తీస్తున్నారు. ఐదు మందికి నకిలీ సేల్‌డీడ్స్‌తో సంబంధముండటంతో వారిని అరెస్ట్ చేశారు. ఆ విచారణలో ఎక్కువగా అగ్రిమెంట్ల కోసం ఉపయోగించడంతోపాటు పాత తేదీల నాటి బాండు పేపర్లపై నోటరీలు తయారు చేసినట్లు నిందితులు వెల్లడించారని పోలీసులు తెలిపారు. ఎక్కువగా ఓల్డ్ తేదీలలో ఉన్న బాండు పేపర్లను రెంటల్ అగ్రిమెంట్స్‌కు వాడటంతో పాటు ఆయా డాక్యుమెంట్లు ఇప్పుడు ఎక్కడ ఉన్నాయనే విషయంలో స్పష్టత రావడం లేదు. దీంతో ఈ కేసులో పోలీసులు మూలాల వరకు వెళ్తారా? మరో ఇద్దరిని అరెస్ట్ చేసి ఈ కేసును ఇంతటితో ముగించేస్తారా?అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నార్సింగి, బండ్లగూడ జాగీర్, కామారెడ్డి మున్సిపాలిటీలలో పనిచేసే ఉద్యోగుల నుంచి ఎక్కువ బర్త్ సర్టిఫికెట్లు జారీ అయినట్లు పోలీసులు గుర్తించారు. అయితే ఆయా సర్టిఫికెట్లు ఎవరికి అందాయి? ఎవరెవరికి ఇచ్చారు? అనే విషయాలపై కూడా స్పష్టత లేదు. పరారీలో ఉన్న కీలకమైన ఇద్దరు నిందితులు పోలీసులకు చిక్కితేనే ఈ విషయంపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయని పోలీసులు పేర్కొంటున్నారు.

చంపారా?..చనిపోయాడా?

- మరోసారి తెరపైకి ఆటోడ్రైవర్ ఇర్ఫాన్ మృతి ఘటన
- రాజేంద్రనగర్ ఠాణాలో పోలీసులు కొట్టడంతో మృతి చెందినట్లు బంధువుల ఆరోపణ
- సుమోటోగా స్వీకరించిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ
- విచారణ జరిపి నివేదిక సమర్పించాలని పోలీసులకు నోటీసులు

సిటీబ్యూరో,జూన్6(నమస్తే తెలంగాణ):రాజేంద్రనగర్ ఠాణాలో అనుమానాస్పదంగా మృతి చెందిన ఆటోడ్రైవర్ ఇర్ఫాన్ మృతి చెందిన ఘటనను జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సుమోటోగా స్వీకరించింది. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి వారం రోజుల్లో నివేదిక సమర్పించాలంటూ పోలీసులకు నోటీసుల